క్లుప్తంగా

రంజాన్ తోఫా అందజేత



మానవపాడు: మండల కేంద్రంలోని జామీయా మసీద్‌లో శుక్రవారం రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు అల్ ఖైర్ మైనార్టీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అన్వర్, హర్షద్, ఇబ్రహీం, రహమతుల్లా, మహబుబ్‌భాషా, నాసిర్‌అల్తాఫ్, కాజా మైబుబ్ ఫిరోజ్, అన్వర్, అబ్దుల్ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మానవపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఏఎన్ఎంలు, ఆశాలు శుక్రవారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో, ఉపాధి హామీ కూలీలకు ఎండల తీవ్రతపై నీటిలో ఓఆర్ఎస్‌ను తాగేందుకు అవగాహన కల్పించారు.

ఆరు గ్యారంటీల అమలేదీ?

శాంతినగర్: ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసపూరిత హామీలు ఇచ్చి మాట తప్పడం సరియైంది కాదని బీజేపీ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు నరసింహులు అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కిసాన్‌మోర్చా కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, అమలుకు నోచుకోని వివిధ హామీలు గుప్పించి నెరవేర్చలేదన్నారు.

జూలెకల్‌లో క్రికెట్ టోర్నీ

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్‌లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకట్, అంజి తెలిపారు. ఈనెల 8 నుండి జేపీఎల్ సీజన్–4 ప్రారంభమవుతుందని క్రీడాకారులు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు వేలం పాట ఉంటుందని, ఆసక్తి గల వారు ఆటగాళ్లను వేలంపాటలో రూ.2,500 లోపు కొనుగోలు చేయాలన్నారు. మొదటి బహుమతి రూ.10,016, రెండవ బహుమతి రూ.5,016, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ బహుమతులుంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

సభ విజయవంతం చేయండి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని కేఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 12న ఉదయం 10గంటలకు నిర్వహించనున్న అంబేద్కర్ ఆలోచన పండుగ, ర్యాలీ, సభలను విజయవంతం చేయాలని అతిఖుర్ రహ్మాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కరపత్రాలను విడుదల చేశారు. బహుజనులు, దళిత సంఘాలు, ఉద్యోగ, ప్రజాసంఘాలు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సునంద్, మాచర్ల ప్రకాష్, సుధాకర్, మహేష్ తదితరులు ఉన్నారు.

గాయపడిన జింకపిల్ల అప్పగింత



ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా సమీపాన పంట పొలాల్లో జింకను కుక్కలు కరవగా, స్థానికులు అలంపూర్ చౌరస్తాలోని అవుట్‌పోస్టుకు తరలించారు. శుక్రవారం ఏఎస్ఐ అయ్యన్న అటవీశాఖకు అప్పగించినట్లు తెలిపారు. గాయాలతో ఉన్న జింకను మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో చికిత్స అనంతరం మహబుబ్ నగర్ జిల్లాలోని పిల్లలమరి పార్కుకు తరలించినట్లు తెలిపారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



శాంతినగర్: ఆరోగ్యవంతమైన పశుసంపద కోసం టీకాలు తప్పనిసరిగా వేయించాలని శాంతినగర్ వెటర్నరీ డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో శుక్రవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించి పశుసంపదను కాపాడుకోవాలన్నారు. గ్రామంలోని 24 మంది రైతులకు సంబంధించి 171 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, రవి కిరణ్ పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులే దిక్కు

- యువతకు ఉద్యోగాలు లేక ఉపాధి పనులకు..
- ఉన్నత చదువులు చదివినా కూలీ పనులే దిక్కంటున్న యువకులు
- వర్షాభావ పరిస్థితులతో అప్పుల పాలైన రైతు కుటుంబాలు



వడ్డేపల్లి మండలం జూలెకల్‌లో ఉపాధి పనులు చేస్తున్న నిరుద్యోగులు

శాంతినగర్: ఉద్యోగాలు లేని నిరుపేదలకు ఉపాధి పనులే దిక్కవుతున్నాయని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో 134 పంచాయతీలు ఉండగా నిత్యం సుమారు 30 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కో గ్రామంలో 150 నుంచి 300 మంది వరకు ఉపాధి పనులకు వెళ్తున్నారు. వారిలో ప్రతి గ్రామంలో 50 నుంచి వంద మంది వరకు నిరుద్యోగులు ఉన్నట్లు ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో రైతాంగం కుదేలైంది. పంటలు సరిగా దిగుబడి రాక, గిట్టుబాటు ధరలు లేక రైతులకు, కూలీలకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఉన్నత చదువులు చదివే పిల్లలను ఆర్థిక ఇబ్బందులతో చదివించలేక కొందరు ఇళ్ల వద్దే ఉంచుకోగా మరికొందరు కూలీనాలి చేసైనా పిల్లలను చదివించుకోవాలనే తపనతో కాలం వెళ్లదీస్తున్నారు. తల్లిదండ్రులు చెమటోడ్చి పస్తులుండి పిల్లలను చదివించినా ఉద్యోగాలు రాకపోవడంతో నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు.

ఉన్నత చదువులు చదివినా..

నియోజకవర్గంలోని యువకులు డిగ్రీ, పీజీ, బీఈడీ, టీటీసీ, ఎంబీఏలు చదివినా ఉద్యోగ అవకాశాలు లేక వంద రోజుల పనే దిక్కయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంటలు పండక పోవడంతో ఆర్థిక ఇబ్బందులతో అప్పులపాలైన తల్లిదండ్రుల పరిస్థితి గమనించిన నిరుద్యోగ యువత ఉపాధి బాటపట్టారు. ఒక్కో గ్రామంలో కనీసం 50 నుంచి 100 మంది వరకు నిరుద్యోగులు ఉపాధి పనులకు వెళ్తున్నట్లు చెబుతున్నారు.

నిరుద్యోగ భృతికి నోచుకోక

రాష్ట్రంలో వివిధ పార్టీలు ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, లేని పక్షంలో భృతి ఇస్తామని చెబుతూ వస్తున్నారని, ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత మొండి చేయి చూపుతున్నారని వాపోతున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా తమను ఆదుకునే వారు లేరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ కొలువులను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారిని ఇంటి వారిని చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగం రాక ఉపాధి పనికి..



ఎంఏ, బీఈడీ చదివినా ఉద్యోగం రాకపోవడంతో ఇంటి వద్దే ఉండాల్సి వచ్చింది. తల్లిదండ్రులు కష్టపడి పోషిస్తుంటే నేను కూర్చుని ఎలా తినేది. నేను ఉపాధి పనులకు వస్తానంటే మానాన్న వాళ్లు వద్దన్నారు. ఇంత చదువు చదివి వంద రోజుల పనికి వస్తావా అంటున్నా వినకుండా వారికి భారమవడం ఇష్టంలేక ఉపాధి పనులకు వెళ్తున్నాను. ప్రస్తుత ప్రభుత్వమైనా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే నిరుద్యోగుకులకు బాగుంటుంది.

–అంజనేయులు, నిరుద్యోగి, జూలెకల్

ఉద్యోగాలు లేక వివాహాలు కాక



ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో సమాజంలో పిల్లనిచ్చే పరిస్థితి లేదు. నాతోటి స్నేహితులు చాలా మందికి ఉద్యోగాలు రాలేదు. టీటీసీ, పీజీలు చేశారు. వివాహాలు కాక, తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు కలిగిస్తూ భారం కాలేక సతమతమవుతున్నాం. పొలం పనులు లేక వంద రోజుల పనికి వెళ్తున్నాం. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇచ్చి కొంత వరకు తల్లిదండ్రులకు భారం తగ్గించాలి.

– ఎస్.జగదీష్, నిరుద్యోగి, జూలెకల్

యువకులు పనులకు వస్తున్నారు



ఉపాధి పనులకు చాలామంది చదువుకున్న యువకులు వస్తున్నారు. ప్రతి గ్రామంలో 150 మందికి పైగా ఉపాధి పనులు కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతి గ్రామంలో 150 నుంచి 300 మంది వరకు ప్రతి రోజు పనులకు వస్తున్నారు. ఇటీవల పండుగలు ఉన్నందున కొంత తక్కువగా వస్తున్నారు. ఉగాది తర్వాత చాలా మంది యువకులు పనులకు వస్తామని చెబుతున్నారు. అందరికి ఉపాధి కూలీ పనులు కల్పిస్తాము.

– కుమార్, ఏపీఓ, వడ్డేపల్లి మండలం

కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

అలంపూర్: మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు బత్కయ్య అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటిగా మారిన తర్వాత మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అలంపూర్ చేరుకొని బత్కయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, నాయకులు సదానందమూర్తి, దుబ్బ వెంకటేశ్వర్లు, మొక్తార్, రఘురెడ్డి తదితరులు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బుద్దారెడ్డిపల్లికి చెందిన జయ్యన్న భార్య తిమ్మమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం ఆస్పత్రికి చేరుకొని భాదితురాలిని పరామర్శించారు. అనంతరం ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

సభ్యులు ఐదు గ్రామాలు పర్యటించాలి



శాంతినగర్: వీహెచ్‌పీ మండల సభ్యులు ఐదు గ్రామాలు పర్యటించి రామోత్సవాలు జరిగేలా చూడాలని తీర్మానించారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో శుక్రవారం వీహెచ్‌పీ ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సమితి సభ్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. త్వరలో జరగబోయే శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిపించాలని సూచించారు. సమావేశంలో 8 గ్రామాలకు చెందిన 42 మంది సభ్యులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో తాగునీటి సమస్య

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలికలో తాగు నీటి సమస్య తలెత్తింది. మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో నీటి సమస్య ఏర్పడిందని రామాలయం, జమ్ములమడుగు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులు స్పందించి వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు కోరారు.

భక్తిశ్రద్ధలతో కిస్తీ మహోత్సవం



కిస్తీ ఉత్సవంలో పాల్గొన్న కైరవాడి పీఠాధిపతి అల్లిపీరస్వామి, గ్రామస్తులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగలలో వెలసిన హజరత్ షేక్ ఉసేన్ సాహెబ్ కిస్తీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం గంధోత్సవంతో ప్రారంభమైన వేడుకలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన కిస్తీ వేడుకలకు హెచ్ కైరవాడి పీఠాధిపతి అల్లిపీర స్వాముల వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు గజమాలతో శిష్యులు సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అడుగంటిన భూగర్భజలాలు



ధరూరు శివారులో ఎండిన వరి పంట

- ప్రశ్నార్థకంగా యాసంగి పంటల పరిస్థితి
- ఆందోళనలో అన్నదాతలు

ధరూరు: మండలంలో బోర్లు, బావులపై ఆధారపడి పంటలు సాగు చేసుకున్న రైతుల పరిస్థితి అమ్మ గోచరంగా తయారైంది. ప్రధానంగా మండలంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రధాన కాల్వలో ఊట నీటిపై ఆధారపడి వందలాది ఎకరాల్లో పంటలు సాగు చేసుకున్నారు. ప్రస్తుతం సాగు చేసుకుంటున్న పంటలు చివరి దశలో ఉన్నాయి. కాల్వ వెంట ఉన్న మండలంలోని జాంపల్లి, ధరూరు, మార్లబీడు, చెన్నారెడ్డిపల్లి, గుడ్డెందొడ్డి, మన్నాపురం రైతులు యాసంగిలో వరి, ఇతర పంటలు సాగు చేసుకున్నారు.

నిండని కుంటలు, చెరువులు

గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండలేదు. దీంతో వాటి కింద ఉన్న బావులు, బోర్లలో నీళ్లు అడుగంటి పోయాయి. సాగు చేసిన పంటలకు పూర్తి స్థాయిలో నీళ్లందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు కొందరు కొత్త బోర్లను వేసేందుకు సిద్ధమవుతున్నారు. మరో వారం పది రోజులు గడిస్తే పంటలు చేతికొస్తాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే వంద ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంటలపై ఆశలు పెట్టుకున్న రైతులను ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు నెల క్రితం 100 నుంచి 150 ఫీట్లలో బోర్లలో పుష్కలంగా నీళ్లు రాగా, నేడు అదే బోర్లు ఎండుముఖం పట్టాయి.

వరికి తగ్గిన డిమాండ్..

గతేడాది వరికి మంచి డిమాండ్ ఉండగా.. ఈ సారి కొంత తగ్గినట్లు రైతులు చెబుతున్నారు. గద్వాల మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2వేల నుంచి రూ.2,500 పలుకగా, అదే కర్ణాటక రాయచూరు మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ.3వేల వరకు పలికింది. దీంతో అదే ఆశతో రైతులు పంటలను సాగు చేసుకోగా, ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న రేట్లు రైతులను ఒకింత నిరుత్సాహానికి గురి చేస్తున్నాయి. ప్రస్తుతం రాయచూరు మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,600 నుంచి రూ.2,800 వరకు ధర పలుకుతున్నట్లు రైతులు తెలిపారు.

పంటలు ఎండుతున్నాయి



బావులు, రిజర్వాయర్లపై ఆధారపడి పంటలు సాగు చేసుకున్నాం. నాకున్న 2 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. పంట చేతి కొచ్చే సమయంలో నీళ్లందక ఒకటిన్నర ఎకరాల పంట ఎండిపోయింది. కేవలం అర ఎకరం మాత్రమే మిగిలి ఉంది. దానిని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నాను. పక్కనే ర్యాలంపాడు రిజర్వాయర్ ఉన్నా, పంటలకు సాగు నీరు అందడం లేదు.

– రైతు నర్సన్న, ర్యాలంపాడు

బోర్లలో నీళ్లు అడుగంటాయి



బోరు బావిని ఆధారం చేసుకుని మేము నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాం. 2.5 ఇంచుల్లో పుష్కలంగా వచ్చే నీళ్లు పూర్తిగా అడుగంటిపోయి పంటంతా ఎండిపోయింది. ఏం చేయాలో తోచడం లేదు. నెట్టెంపాడు కాల్వలో కూడా నీళ్లు అడుగంటిపోయాయి. చేతికొచ్చిన పంటలు కళ్ల ముందే ఎండుతున్నా ఏమి చేయలేని నిస్సహాయ స్థితి మాది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.

–నర్సింహులు, రైతు, ధరూరు

బాబు జగ్జీవన్‌రాం ఆదర్శప్రాయుడు



గద్వాలలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, నాయకులు



గద్వాలలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



కేటీదొడ్డి తహసీల్దార్ కార్యాలయంలో..

గద్వాల: బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను రాజకీయ, వివిధ వర్గాల ప్రజలు, సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానికంగా ఉన్న విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ, బీఎస్పీతో పాటు నడిగడ్డ హక్కుల పోరాట సమితి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు వేర్వేరుగా జయంతి వేడుకలను నిర్వహించారు.

అలంపూర్: బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు కృషి చేద్దామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, సీపీఎం మండల కార్యదర్శి నరింసహ అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బాబు జగ్జీవన్ రాం 116వ జయంతిని కేవీపీఎస్, సీపీఎం అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రాం చిన్న తనంలోనే కుల వివక్ష నిర్మూలకు పోరాటం చేశారన్నారు. పాఠశాలలో కులాల పేరుతో ఉన్న కుండలను పలుమార్లు పగలకొట్టి తొలి విజయం అందుకున్నారన్నారు. ఆయన జీవితంలో 52 ఏళ్ల రాజకీయాల్లో ఉంటూ ప్రజలకు సేవలందించారన్నారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకటస్వామి, ఆశన్న, సదానందం, రాముడు, నర్సింహ మహబుబ్‌బాషా, శ్రీధర్, మాలిక్ బాషా తదితరులు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ప్రజాస్వామ్య నిర్మాణం కోసం అలుపెరగని పోరాటం చేసిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని మాజీ ఎంపీ మందా జగన్నాథం అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని కొండేరులో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, మందా శ్రీనాథ్, ఎంపీటీసీ వీరన్న, ఏకాంత్, యోహాన్, యువరాజు, రఘు, వెంకటేష్, నాగన్న, బీచుపల్లి, బీసన్న, రాజు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను మండలంలోని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో, వివిధ గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమయ్య, వెంకటేష్ నాయుడు, సురేష్ పాల్గొన్నారు.

రాజోళి: బాబు జగ్జీవన్‌రాం దేశానికే ఆదర్శప్రాయుడని కేవీపీఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రం బస్టాండ్ ఆవరణలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, గోపాల్, గంగిరెడ్డి, లక్ష్మన్న, మూగెన్న, హసన్, నాయకులు పాల్గొన్నారు.

గట్టు: బల్గెరలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బల్గెర హనుమంతు, ఇమ్మానియేలు, ఏసన్న, యేసురాజు, ముక్కెరన్న, డేవిడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయిజ: బాబు జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలను మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో విగ్రహానికి వివిధ సంఘాల, పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శాంతినగర్: శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రాం చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాబు జగజ్జీవన్ రాం జయంతి సందర్భంగా చిత్రపటానికి తహసీల్దార్ సలీముద్దీన్ పూలమాల వేసి నివాళులర్పించారు.





కొండేరులో నివాళి అర్పిస్తున్న మందా జగన్నాథం,అలంపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



గట్టు మండలం బల్గెరలో..



అయిజలో..

కంప చెట్లు తొలగించండి



కంప చెట్లతో మూసుకుపోయిన పచ్చర్ల–తుమ్మిళ్ల పైపులైన్ రోడ్డు

రాజోళి: పచ్చర్ల నుంచి తుమ్మిళ్లకు వెళ్లే పైపులైన్ రోడ్డుపై కంప చెట్లను తొలగించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్డు గుండా పచ్చర్ల, రాజోళి, తుమ్మిళ్ల, అశోక్ నగర్ క్యాంపు ఇతర గ్రామాలకు వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. ఈ రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగి మొత్తం మూసుకుపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించడం లేదని వాహనదారులు అంటున్నారు. పలు గ్రామాల మధ్య దూరం కూడా తగ్గుతుండటంతో వాహనదారులు ఈ రోడ్డు గుండా వెళ్తుంటారు. ప్రమాదాలు కాకుండా కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

నిర్మానుష్యంగా ప్రధాన రోడ్లు



జనం బోసిపోయిన ధరూరు వైఎస్సార్ చౌరస్తా

ధరూరు: రికార్డు స్థాయిలో ఈ సారి ఎండలు మండిపోతున్నాయి. ఇంట్లో ఉంటే ఉక్కపోత.. బయటకు వస్తే భానుడి భగభగ అన్నట్లుగా ఉండడంతో జనం బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఎండత తీవ్రత కారణంగా ప్రధాన రోడ్లన్నీ జనం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఒకానొక దశలో కర్ఫ్యూ అలేగే కరోనా లాక్ డౌన్ సందర్భాలను గుర్తు చేస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఎండలు అధికంగా ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం మండలంలో 43.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కేవలం ఉదయం 10 గంటల వరకు మాత్రమే జనం రోడ్డు మీద కనిపిస్తున్నారు. ఆలోపే పనులన్నీ చక్కబెట్టుకుంటున్నారు. తిరిగి సాయంత్రం 6గటంల నుంచి ఇళ్లలోంచి జనం బయటకు వస్తున్నారు. ఇక మధ్యాహ్నం వేళల్లో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో మిట్ట మధ్యాహ్నం ఎండుకు విద్యార్థులు విలవిలాడుతున్నారు.